# రోడ్లపై చెత్త వేస్తే కేసులే

- పేరుకుపోతున్న చెత్త కారణంగా ఇబ్బందులు
- ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త బాధ్యతలు
- పశ్చిమ మండలం పరిధిలో పోలీసుల నిఘా

**బంజారాహిల్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** అందమైన నగరానికి చెత్త ఓ పెద్ద మచ్చలా మారింది. నిర్వహణ లోపమో, బాధ్యతారాహిత్యమో తెలియదు కాని చెత్త సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ కొత్త తరహా ప్రయోగాలు చేస్తోంది. ముఖ్యంగా ఇళ్లలో చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలని అధికారులు ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌ల వారీగా స్వచ్ఛ ఆటోలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొందరు నిర్లక్ష్యంగా చెత్తను రోడ్డుపై పడేస్తుండడం పెద్ద సమస్యగా మారింది. దీనిని పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ చెత్తకుండీల వద్ద మొక్కలు పెట్టినా ఫలితం రాలేదు. ఇటీవల వాయిస్ ఓవర్ సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎవరైనా చెత్త రోడ్డు మీద వేస్తే ఆ విషయాన్ని సీసీ కెమెరా ద్వారా వాయిస్ ఓవర్ కనిపెట్టి ఇక్కడ చెత్త వేయరాదు అంటూ ప్రకటన చేస్తుంది. ఇలా వాయిస్ వచ్చినప్పుడు సిగ్గుతో ఎవరూ చెత్త వేయరు అనేది జీహెచ్‌ఎంసీ అధికారుల ఆలోచన. ఈ మేరకు సర్కిల్-18లోని పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ఈ వాయిస్ ఓవర్‌ను ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యారు. దీంతో కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌ల పరిసర ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. రోజుల తరబడి ఎత్తకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతను పశ్చిమ మండలం పోలీసులు భుజాన వేసుకున్నారు. ఇక మీదట రోడ్ల మీద చెత్త వేసే వారిని గుర్తించి కేసులు పెట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ మేరకు పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.


యూసుఫ్‌గూడలో పేరుకుపోయిన చెత్త

### సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ

పోలీస్‌స్టేషన్‌ల వారీగా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. పోలీసుల అధీనంలో ఉన్న ఈ కెమెరాలను ఇప్పటి వరకు కేసుల పరిష్కారం కోసం ఉపయోగించేవారు. ఇక మీదట చెత్త పేరుకుపోతున్న ప్రాంతాలపై కూడా దృష్టి సారించనున్నారు. ఎక్కడైనా చెత్త కనిపిస్తే వెంటనే కానిస్టేబుల్ అక్కడకు వెళ్లి జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం ఇస్తారు. దగ్గరుండి తొలగించేలా చర్యలు తీసుకుంటారు. అంతేగాకుండా అక్కడ చెత్త వేయకుండా ఉండేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. అయినప్పటికీ ఎవరైనా చెత్త వేస్తే వారిని కెమెరాల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేయనున్నారు.

### బీఎన్‌ఎస్ నిబంధనల ప్రకారమే

చెత్త అనేది జీహెచ్‌ఎంసీ పరిధిలోని సమస్య. మరి పోలీసులకేం పని అనే వాదన వినిపించే అవకాశాలు ఉన్నాయి. భారతీయ న్యాయ సంవిధాన్(బీఎన్‌ఎస్) నిబంధనల ప్రకారం ప్రజా ఆరోగ్యం ఇబ్బందుల్లో పడినప్పుడు పోలీసులు చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంది. దీనిని ఆసరాగా చేసుకొని చెత్త సమస్యను పోలీసులు భుజాన వేసుకున్నారు. ఎప్పుడూ నేరస్థులు, కేసులతో బిజీగా ఉండే పోలీసులు ఇక మీదట చెత్త వేసే వారిపై కూడా నిఘా పెంచనున్నారు. కొందరు తమ పరిసరాలను కలుషితం చేస్తూ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారని, దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని డీసీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త వేస్తూ పట్టుబడిన వారిపైన పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రోడ్లపైన, కూడళ్లలో చెత్త వేస్తూ పోలీసుల కంటపడ్డ వారిపై కేసులు నమోదు చేయాలని ఇప్పటికే స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో డీసీపీ బుధవారం పశ్చిమ మండలంలోని జూబ్లీహిల్స్, మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. చెత్త పేరుకుపోయిన


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2లోని అన్నపూర్ణ స్టూడియో వద్ద పేరుకుపోయిన చెత్త

ప్రదేశాలను గుర్తించి, వాటిని వెంటనే శుభ్రం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. రోడ్లపై వ్యాపారాలు చేసి ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్న వారిని కూడా తొలగించాలని ఆయా ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు.

### చిరు వ్యాపారులతో సమస్యే

యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వద్ద రోడ్లపైనే కొందరు చేపల వ్యాపారం చేస్తుంటారు. సాయంత్రం కాగానే చెత్త అక్కడే వేసి వెళ్లిపోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు పలుసార్లు ఫిర్యాదులు చేశారు. ఆదివారం అయితే ఆ దారిలో ప్రయాణం చేయడం కూడా ఇబ్బందిగానే మారిందని వాహనదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డీసీపీ వ్యాపారులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్ల మీద చెత్త వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో నడిచే టిఫిన్ బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్ల మీదనే వేస్తున్నట్టు గుర్తించారు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు అవసరం లేకున్నా చెత్తను రోడ్ల మీద వేస్తున్నట్టు కెమెరాల ద్వారా గుర్తించారు.


బ్రాహ్మణవాడిలో రోడ్డుపై కేబుల్ వైర్లు

## రోడ్లపైనే కేబుల్ వైర్లు

- కట్ చేసి తొలగించని విద్యుత్ అధికారులు
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు

**బేగంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** బేగంపేట బ్రాహ్మణవాడిలోని పలుచోట్ల కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు కట్ చేసి రోడ్లపై వేశారు. నెల రోజులు అవుతున్నా కేబుల్ వైర్లను తొలగించకపోవడంతో రోడ్డునెంబర్.2 తోపాటు రోడ్డునెంబర్.6లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా గాయపడుతున్నారు. స్థానికులు విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాహనం లేక వైర్లను తొలగించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా కేబుల్ వైర్లను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కేటీఆర్ జూబ్లీహిల్స్‌లో పోటీ చేయాలి

**బంజారాహిల్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** మాజీ మంత్రి కేటీఆర్ జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిగూడలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ లంగా గాళ్లు అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పేదలందరికీ తెల్లరేషన్‌కార్డులిస్తాం

**బేగంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు ఇస్తుందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. బుధవారం పాటిగడ్డలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విశాల్ సుధాం, హనీఫ్‌ఖాన్, నజీర్, చిరంజీవి, బబ్లూ పాల్గొన్నారు.


హన్మంత్‌రెడ్డిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

## ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ అధ్యక్షుడి ఎన్నిక

**బంజారాహిల్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10 ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ విజయ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా కొలన్ హన్మంత్‌రెడ్డి బుధవారం ఎన్నికయ్యారు. ఈనెల 9న జరిగిన ఎన్నికల్లో హన్మంత్‌రెడ్డికి చెందిన ప్యానెల్ ఘన విజయం సాధించింది. చీఫ్ అడ్వయిజర్‌గా కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, ఉపాధ్యక్షులుగా సూర్యప్రకాశ్‌రావు, ప్రధా న కార్యదర్శిగా సందీప్‌రెడ్డి, కోశాధికారిగా సీతామాధురి, కార్యవర్గ సభ్యులుగా ముత్యంరెడ్డి, రవీందర్, సురేందర్‌రెడ్డి, గాయత్రిలత, అనుపమరెడ్డి ఎన్నికయ్యారు. హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్టు చెప్పారు.


రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డును అందుకున్న ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ మల్లేష్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర కుమార్, టీజీవో జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్
● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి

# హరిజన బస్తీలో మురుగు పరుగు

- దుర్గంధంతో ఇబ్బందిపడుతున్న స్థానికులు

**హైటెక్ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** మాదాపూర్ హరిజన బస్తీలోని రహదారిపై మురుగు పరుగులు తీస్తోంది. నిత్యం ఉదయం 6 గంటల నుంచి 11గంటల వరకు ఈ సమస్య తలెత్తుతోంది. హరిజన బస్తీలోని ఇంటి నెంబర్.1-14/3 సత్తయ్య ఇంటి నుంచి సుమారు కిలోమీటరు దూరం ప్రధాన రహదారి మెట్రో పిల్లర్ నెంబర్ సి.1739 నుంచి ప్రవహిస్తోంది. మ్యాన్‌హోళ్లు పూర్తిగా నిండిపోవడంతో వాటి నుంచి మురుగు పైకి ఉబికి వస్తూ దుర్గంధం వ్యాపిస్తోంది. ఇప్పటి అవసరాలకు మ్యాన్‌హోళ్లు సరిపోక ఈ సమస్య తలెత్తింది. ఎప్పుడో ఒకసారి జీహెచ్‌ఎంసీ సిబ్బంది వచ్చి మ్యాన్‌హోల్ క్లీన్ చేసి వెళ్లి పోతున్నారు. కానీ, ఇక్కడ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇక్కడి నివాసితులు, ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఎన్నో నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇళ్ల ముంగిట నుంచి మురుగు నీరు ప్రవహించడంతో ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు డ్రైనేజీ నుంచి ప్రవహించే మురుగు సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


హరిజన బస్తీ గల్లీ రోడ్డులో మురుగు


బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన ఆత్మకూరి క్రాంతికిరణ్‌ను అభినందిస్తున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నాయకులు పులిరామ్, బడుగు సతీష్, జ్ఞానేశ్వర్ తదితరులు
● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

# 17లోపు ఓటు నమోదుకు అవకాశం

**వెంగళరావునగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఈనెల 17వ తేదీలోపు 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదుతోపాటు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉందని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, సర్కిల్-19 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.మొత్తం 407 పోలింగ్ బూత్‌ల లిస్టులు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓల లిస్టు, వారి పరిధిలో వచ్చే పోలింగ్ బూత్‌ల సమాచారాన్ని సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులకు ఇచ్చారు. ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేశామని, స్థానికులు తమ పేర్లను చూసుకోవాలని సూచించారు. ఈనెల 30న తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీల నాయకులు డివిజన్లకు సంబంధించి మ్యాపులు కావాలని, ఎన్నికలకు సంబంధించిన సమాచారం తెలుగులో కావాలని


సమావేశంలో మాట్లాడుతున్న రజనీకాంత్‌రెడ్డి

కోరారు. సమావేశంలో టి.సాయిశేషగిరిరావు, జాకటి స్వామి(సీపీఎం), దేవేందర్, మలాకి(ఐఎన్‌సీ), సుప్రియాగౌడ్(బీజేపీ), బాలరాజ్, రాము యాదవ్(టీడీపీ), సీహెచ్ రామకృష్ణ(బీఆర్‌ఎస్), వెంకటేశ్వరరావు(బీఎస్పీ), నసీర్(ఎంఐఎం), డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, ఏఈఆర్‌ఓ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## నిమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సరఫరాకు
# ఐదు సంస్థల మధ్య పోటీ

**నిమ్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** నిమ్స్ ఆస్పత్రిలో రెండేళ్లకు ఒకసారి జరిగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కాంట్రాక్ట్(మ్యాన్‌పవర్) సరఫరా కోసం ఐదు సంస్థల నడుమ పోటీ నెలకొంది. ప్రస్తుతం ఆస్పత్రిలో రెండు సంస్థలు మ్యాన్‌పవర్ సరఫరా ఏజెన్సీలుగా ఉన్నాయి. రెండు నెలల క్రితం పాత కాంట్రాక్ట్ గడువు ముగిసింది. దాంతో నిమ్స్ యాజమాన్యం ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 1200 మందిని నిమ్స్ ఆస్పత్రికి కాంట్రాక్ట్ పద్ధతిన కేటాయించాల్సి ఉంది. వారిలో వర్కర్లు, సెమిస్కిల్డ్ వారు ఉన్నారు. పాత సంస్థలతో పాటు ప్రస్తుతం మరో మూడు సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ ఐదు సంస్థల్లో ఎవరు తక్కువ ధరకు కోట్ చేస్తే వారికి టెండర్ దక్కే అవకాశం ఉంది. అయితే, టెండర్ పరిశీలనలో వారి అనుభవం, అర్హత ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. టెండర్ దాఖలు గడువు ముగిసిన తర్వాత 180 రోజుల్లో దాని ఫలితం విడుదల చేస్తామని నిబంధనలో ఉంది.

## గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం


ఎర్రగడ్డలో గుర్తు తెలియని మృతదేహం


ఎస్ఆర్‌నగర్ బస్టాప్ వద్ద గుర్తు తెలియని మృతేహం

**బోరబండ/అమీర్‌పేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధి ఎర్రగడ్డ రైతుబాజార్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు గీతలున్న లావెండర్ చొక్కా, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. అలాగే, సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు ఉన్న వ్యక్తి 10 రోజుల క్రితం ఎస్ఆర్‌నగర్‌కు వచ్చి యాచక వృత్తి చేస్తూ రాత్రివేళ బస్టాప్ సమీపంలో నిద్రించేవాడు. బుధవారం మృతిచెందడంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## వివాహిత అదృశ్యం

**పంజాగుట్ట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట బాలాపుర బస్తీకి చెందిన వి.పద్మశ్రీ(29) ఈనెల 8న రాత్రి పది గంటల ప్రాంతంలో ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పద్మశ్రీ

## పెళ్లికి నిరాకరించిన యువతికి వేధింపులు

**బంజారాహిల్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** ప్రవర్తన బాగోలేదని పెళ్లికి నిరాకరించిన యువతిని, కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్న వ్యాపారిపై కేసు నమోదైంది. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే యువతికి గతేడాది బాలాపూర్‌కు చెందిన వ్యాపారి ఆదర్శ్ వేముల సంబంధం వచ్చింది. పలుమార్లు ఆదర్శ్ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ నోరు జారడంతో సంబంధం వద్దు అనుకున్నారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్‌లో ఆదర్శ్ యువతికి ఫోన్ చేసి క్షమాపణ చెప్పాడు. మారినట్టు యువతి నమ్మింది. ఆగస్టులో నిశ్చితార్థం పెట్టుకున్నారు. తరుచూ ఇద్దరు కలిసేవారు. అతడి ఫోన్‌లో మరో అమ్మాయితో కలిసి దిగిన ఫొటోలు ఉండడంతో యువతి నిలదీసింది. దీంతో ఆమెపై చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు చెప్పింది. అప్పటి నుంచి యువతికి ఫోన్ చేసి అసభ్యకరంగా తిడుతూ, వేధింపులకు గురిచేస్తున్నాడు. కుటుంబసభ్యులను కూడా వేధిస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# దొరలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ


ఫిలింనగర్‌లో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, బోదాసు నాగార్జున తదితరులు

**బంజారాహిల్స్/బోరబండ/పంజాగుట్ట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** భూమి, భుక్తి, విముక్తి కోసం దొరలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని పలువురు నాయకులు కొనియాడారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ బ్రహ్మశంకర్ నగర్ బ్రహ్మంగారి గుడి దగ్గర బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చింటు, లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, రమేష్‌రెడ్డి, శైలజ, అహ్మద్, విజయ్, దశరథ్, నరేందర్ పాల్గొన్నారు. జవహర్‌నగర్‌లోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జూబ్లీహిల్స్ జోన్ అధ్యక్షుడు జి.భిక్షపతి, జోన్ కార్యదర్శి కేశరాజు యాదగిరి, సీఐటీయూ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, నాయకులు కేశరాజు గోపీ, ఉపేందర్, ఎన్.యాదగిరి, కె.నర్సింహులు, దండు సత్యనారాయణ, రుద్రమనాయుడు పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్య శిబిరంలో అంజన్ కుమార్ యాదవ్, ఏకేవై ఫౌండేషన్ సభ్యులు

## ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఆరోగ్యం

**ఎర్రగడ్డ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు ఆరోగ్యం లభిస్తుందని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని ఆనంద్ నగర్, ఎర్రగడ్డ, శాస్త్రినగర్, సుల్తాన్‌నగర్, కళ్యాణ్‌నగర్ వెంచర్ త్రీలో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంజన్ కుమార్ యాదవ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కె వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాలు, ఉచితంగా మందులు, ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకేవై ఫౌండేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, కాజా పాషా, జహంగీర్, ఆకాష్, బాలరాజు పాల్గొన్నారు.

## యల్లయ్య సేవలు చిరస్మరణీయం

**ఖైల్‌కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ సాధన పోరాటంలో ప్రభుత్వ రంగ సంస్థల జేఏసీకి సారథ్యం వహించిన ఉద్యమకారుడు యల్లయ్య సేవలు చిరస్మరణీయని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎంఐజీకాలనీలోని యల్లయ్య కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. పరిశ్రమ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే కార్మికుల హక్కుల కోసం పోరాటం సాగించిన నేత యల్లయ్య అని కొనియాడారు. కార్మికులు యల్లయ్యను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## సరైన అవగాహన ద్వారానే ఆత్మహత్యల నివారణ

**ఎర్రగడ్డ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** సరైన అవగాహన ద్వారానే ఆత్మహత్యలను నివారించే వీలుందని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.రాజారావు అన్నారు. ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక చికిత్సాలయంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిత రాయిరాల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డా.రాజారావు మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, మానసిక వత్తిడి కారణంగా యువత ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ సమస్యను సానుకూల దృక్పథంతో చూడాలన్నారు. అనంతరం ఆత్మహత్యల నివారణ అంశాలపై విభిన్నమైన ముగ్గులను తీర్చిదిద్దారు. పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డా.సుధారాణి, డా.వెంకటసుబ్బయ్య, డా.సుమన్‌రెడ్డి, డా.ఉమేష్ కుమార్ పాల్గొన్నారు.

## రోడ్డున పడుతున్న కేబుల్, టెలికాం ఆపరేటర్లు

**పంజాగుట్ట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ శాఖ అధికారుల చర్యల వల్ల కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్, టెలికాం ఆపరేటర్లు రోడ్డున పడుతున్నారని ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్(ఫాకో) ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని, అనధికారిక కేబుళ్ల తొలగింపును వెంటనే ఆపాలని ఫాకో అధ్యక్షుడు డి.సతీష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫాకో గౌరవ అధ్యక్షుడు వి.కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.అరవింద్, ఉపాధ్యక్షులు ఎండీ అబ్దుల్ సలాం, ఎం.కరుణాకర్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. కేబుల్ వ్యవస్థ 30 సంవత్సరాలుగా ఉందని, రాష్ట్రంలో సుమారు 40 వేల మంది కేబుల్ ఆపరేటర్లు ఉండగా, లక్ష మందికి పైగా ఉపాధి పొందుతున్నారని, 40 లక్షలకు పైగా వినియోగదారులకు కేబుల్, ఇంటర్నెట్, టెలికాం సేవలను అందిస్తున్నారని తెలిపారు. కేబుల్ కత్తిరింపులు వెంటనే ఆపాలని కోరుతూ ఈనెల 13న ఇందిరాపార్కు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు శాంతియుతంగా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్(ఫాకో) సభ్యులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, బానుక నర్మద తదితరులు

## కార్తీక్ ఎన్‌క్లేవ్‌లో సొంత నిధులతో పార్కు ఏర్పాటు

● కాలనీవాసులను అభినందించిన ఎంపీ ఈటల

బోయినపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాలనీలో సొంత నిధులతో పార్కు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డు, కార్తీక్ ఎన్‌క్లేవ్‌లోని ప్రజలు సొంత నిధులు రూ.13 లక్షలతో నూతనంగా పార్కును ఏర్పాటు చేసుకున్నారు. ఈ పార్కును స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదతో కలిసి బుధవారం సందర్శించి, కాలనీ వాసులను అభినందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ ద్వారానే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో అంజయ్య, సూర్యనారాయణ తదితరులు

## రోగి కోలుకోవడంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకం

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోగి కోలుకోవడంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర ఎంతో కీలకమని 320ఏ జిల్లా లయన్స్ క్లబ్ క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య అన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద గల లయన్స్ భవన్‌లో ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదారాబాద్ అపూర్వ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 56 మంది ఫిజియోథెరపిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.... రోగులకు సంబంధిత డాక్టర్లు ఆపరేషన్ చేసిన తరువాత రోగి కోలకునేందుకు ఫిజియోథెరపిస్టులు నెలల తరబడి సేవలు అందించడం వల్ల వారు త్వరితగతిన కోలుకుంటున్నారని అన్నారు. డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ అపూర్వ ఆధ్వర్యంలో తాము ఆపదలో ఉన్నవారికి, పేదలకు, విద్యార్థులకు సహాయసహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ నైనా దేవి, యోగా మాస్టర్ కోటేశ్వర్‌రావు, లయన్స్ క్లబ్ జిల్లా డైరీ చీఫ్ ఎడిటర్ పవన్ కుమార్, లయన్స్ క్లబ్ రీజియన్ మాజీ చైర్‌పర్సన్ శంకర్, ఫిజియోథెరపిస్ట్ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, శ్రీకాంత్, కిషోర్, ఇందు మాదవి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో పాఠశాల పీఈటీలు, నిర్వాహకులు

## ఖోఖో చాంపియన్ 'సీఎంఆర్ పాఠశాల'

బోయినపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఖోఖో పోటీలను తిరుమలగిరి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో అండర్-14, అండర్-17 విభాగాలలో బోయినపల్లి సీఎంఆర్ హైస్కూల్‌కు చెందిన బాలుర, బాలికల జట్లు విజయం సాధించి చాంపియన్స్‌గా నిలిచారని పీఈటీ ప్రసాద్ నాయక్ తెలిపారు. మండలంలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ సునీత, పీఈటీలు కేతంపల్లి దాస్, మహేందర్‌లతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రధానికి కృతజ్ఞతలు: ఆనంద్ కుమార్

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబ్‌లను హేతుబద్ధీకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ అల్యూమినియం యుటెన్సిల్స్ మ్యానిఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమ ఆనంద్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లో సంఘం కార్యదర్శి రమేష్ అగర్వాల్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో పేదలపై భారాన్ని తగ్గించారని అన్నారు.



గౌతమ్‌రావును సత్కరించిన కీర్తిహర్షకిరణ్ తదితరులు

## గౌతమ్‌రావుకు సన్మానం

సికింద్రాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎన్.గౌతమ్‌రావును బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గ ఆ పార్టీ నేత మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిశారు. గౌతమ్‌రావును ఘనంగా సత్కరించి, శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయడానికి తీసుకుంటున్న చర్యలు, పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరును ఆయనకు వివరించారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, కన్నాభిరామ్, ప్రకాష్‌గౌడ్, శ్రీధర్‌రావు, హనుమంతు ముదిరాజ్, రాజేష్ ముదిరాజ్, దేవుడు కుమార్, సత్యనారాయణ, ప్రతాప్‌కుమార్, శోభారాణి, నాగరాణి, భాగ్యమ్మ, మమత, ప్రమీల, జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

## రామచందర్‌రావుకు కృతజ్ఞతలు



బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా తనను నియమించిన సందర్భంగా బండ కార్తీకారెడ్డి బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, వేణు యాదవ్, వెంకటేశ్ గౌడ్, మల్లేష్, గణేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి)

# 'కంటోన్మెంట్ వాణి'కి దరఖాస్తుల వెల్లువ

**కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్**



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, మధుకర్ నాయక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్



కంటోన్మెంట్ వాణికి హాజరైన జనం

సికింద్రాబాద్/బోయినపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించిన కంటోన్మెంట్ వాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. బోయినపల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కలిసి కంటోన్మెంట్ వాణిని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెవెన్యూ, సివిల్ సప్లై, ఎలక్ట్రిసిటీ, హెల్త్, పోలీస్, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులు, కంటోన్మెంట్ బోర్డు నుంచి వాటర్ వర్క్స్, హెల్త్ అండ్ శానిటేషన్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అభ్యర్థనలను, ఫిర్యాదులను స్వీకరించారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 8 వార్డులకు చెందిన కాలనీల, బస్తీల ప్రజలు వివిధ దరఖాస్తులు సంబంధిత అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కంటోన్మెంట్ వాణి కార్యక్రమం నియోజకవర్గంలో చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించిన ప్రజల కోసం తన బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టానని ఆయన తెలిపారు. ఈ రోజు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ గోవన్న, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్, ట్రాఫిక్ సీఐ జానకిరాం, బోర్డు అధికారులు దేవేందర్, ఫణికుమార్, కాంగ్రెస్ నాయకులు ఖదీరవన్ రాజగోపాల్, ముప్పిడి మధుకర్, బద్రీనాద్‌యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, బద్దం బల్వంత్‌రెడ్డి, ఎస్.రాజేష్‌యాదవ్, సదా, మారుతిగౌడ్, సంతోష్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ కంటోన్మెంట్ అధ్యక్షురాలు భవాని, 1వ వార్డు అధ్యక్షురాలు గోమతి, 8వ వార్డు అధ్యక్షురాలు శోభ తదితరులు పాల్గొన్నారు.

### నడవలేని స్థితిలో..



కంటోన్మెంట్ వాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన నడవలేని స్థితిలో ఉన్న బొల్లారానికి చెందిన 70 ఏళ్ల షీలను వలంటీర్లు కుర్చీలో మోసుకుని వచ్చి దరఖాస్తును అధికారులకు ఇప్పించారు. 'నేను ఒంటరి మహిళను.. నాకు పెన్షన్ రావడంలేదు.. నాకు సహాయం చేయండి' అని ఆమె మొర పెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆమెకు తగిన సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

# ఆత్మహత్య.. సమస్యకు పరిష్కారం కాదు

● గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర



ఆత్మహత్యలకు వ్యతిరేకంగా గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

అడ్డగుట్ట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర అన్నారు. ఆవేశంతో తీసుకునే నిర్ణయాలు నిండు జీవితానికి, వారి కుటుంబానికి తీరని ఆవేదనను మిగిల్చుతాయని అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో వైద్యులు నర్సుల ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమస్యలు ఉంటాయని, ఆ సమస్యలకు పరిష్కారాలు చూపడంతోనే ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనుపమ, సురేష్, కృష్ణ, చైతన్య, జాహ్నవి, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

# రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

● మాజీ కార్పొరేటర్ అరుణ

● కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మాజీ కార్పొరేటర్ అరుణ శ్రీనివాస్‌గౌడ్

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్, మాజీ టీపీసీసీ కార్యదర్శి దివంగత శీలం ప్రభాకర్ తనయుడు శీలం అనురాగ్ తన అనుచరులతో కలిసి అరుణ గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు తలసాని రవిందర్ (స్కైలాబ్) యాదవ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరుణ గౌడ్ మాట్లాడుతూ... సనత్‌నగర్ నియోజకవర్గంలో, రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో మళ్లీ ఎగురబోయేది బీఆర్‌ఎస్ జెండానేనని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శీలం అనురాగ్ మాట్లాడుతూ.... మా తాత మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ శీలం రాందాస్, మా తండ్రి మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్‌ల రాజకీయ వారసునిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నానని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి వారిపై నమ్మకంతో కార్యకర్తగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శీలం అనురాగ్‌తో పాటు శీలం రతుల్, రిత్విక్, లకన్, కేశవ్ అగర్వాల్, ప్రతీక్, రాహుల్ మెహతా, రెహ్మాన్, ముస్తాఫా, ఆదేశ్‌లతో పాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు అతెల్లి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వంజరపు ఆంజనేయులు, నాయకులు హరి, లక్ష్మీపతి, నాగులు, మహాకాళి ఆలయ మాజీ ధర్మకర్తలు ఆనంద్ పాటిల్, మహేష్ యాదవ్, రామ్మోహన్ యాదవ్, చంద్ర ప్రకాష్, మహేందర్, వీరాంజనేయ స్వామి ఆలయ మాజీ ధర్మకర్త పత్తిపాక సంజయ్, శ్రీవేణుగోపాల స్వామి దేవస్థాన మాజీ ధర్మకర్తలు శివకుమార్, శ్రీనివాస్‌తో పాటు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓయూలో భవనగర్ యూనివర్సిటీ బృందం పర్యటన



బృందానికి ప్రెజెంటేషన్ ఇస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీలో గుజరాత్ రాష్ట్రంలోని మహారాజా కృష్ణకుమార సింహజీ భవనగర్ యూనివర్సిటీ (ఎంకేబీయూ) విద్యా, పరిపాలన బృందం మంగళవారం పర్యటించింది. ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య విద్యా, పరిపాలనా ఉత్తమ పద్ధతులపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం విశ్వవిద్యాలయ చరిత్ర, మౌలిక సదుపాయాలు, ప్రస్తుత పద్ధతులపై వారికి ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో వృద్ధి సాధించడానికి ఓయూ చేపట్టిన వినూత్న చర్యలను ఆయన వివరించారు. గూగుల్ స్కాలర్, విద్వాన్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో అధ్యాపకులను నమోదు చేయడం ద్వారా పరిశోధనల గుర్తింపు, సైటేషన్స్, హెచ్-ఇండెక్స్ పెరగడాన్ని గుర్తు చేశారు. భవనగర్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈ జ్ఞాన మార్పిడి అనుభవం ఎంతో ఉపయోగకరంగా ఉందని, తమ సంస్థ అభివృద్ధికి ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు.



బ్రాహ్మణవాడిలో రోడ్డుపై కేబుల్ వైర్లు

## రోడ్లపైనే కేబుల్ వైర్లు

● కట్ చేసి తొలగించని విద్యుత్ అధికారులు

● ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు

బేగంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బేగంపేట బ్రాహ్మణవాడిలోని పలుచోట్ల కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు కట్ చేసి రోడ్లపై వేశారు. నెల రోజులు అవుతున్నా కేబుల్ వైర్లను తొలగించకపోవడంతో రోడ్డు నెంబర్ - 2తో పాటు రోడ్డు నెంబర్ - 6లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా గాయపడుతున్నారు. స్థానికులు విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాహనం లేక వైర్లను తొలగించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా కేబుల్ వైర్లను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

## 'పరీక్షలు వాయిదా వేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా ఓయూలో నిర్వహించబోయే పరీక్షలను వాయిదా వేయాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శశికాంత్‌కు ఏబీవీపీ లా స్టూడెంట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సిటీ సెక్రెటరీ పృథ్వీతేజ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, గ్రేటర్ హైదరాబాద్ లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్ కోలు గంగా చరన్, ఓయూ అధ్యక్షులు ధృహన్, కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ పార్కులో 17న వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

● హాజర్ కానున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దివంగత ప్రధాని వాజ్‌పేయి విగ్రహం

సికింద్రాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జూబ్లీబస్టేషన్‌ను ఆనుకుని ఉన్న కంటోన్మెంట్ (పికెట్) పార్కులో నెలకొల్పిన దివంగత ప్రధాని వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు రానున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా ఈనెల 17న వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితర నేతలు కూడా హాజరు కానున్నారు.



లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేస్తున్న కోట నీలిమ, విశాల్ సుధాం

## అర్హులకు తెల్ల రేషన్‌కార్డులిస్తాం : కోట నీలిమ

బేగంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేద వారికి కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బహీనవర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్ సుధాం, హనిఫ్‌ఖాన్, నసీర్, చిరంజీవి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ ఏవీ రంగనాథ్

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మడ్‌ఫోర్టులోని దోబీఘాట్‌లో బుధవారం ఆమె విగ్రహానికి రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.

- సికింద్రాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

## మార్టిగేజ్ నిబంధనలను వెంటనే రద్దు చేయాలి

● రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్

సికింద్రాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ నియోజకవర్గమైన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కేంద్ర రక్షణ శాఖ విధించిన నూతన మార్టిగేజ్ నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని, లేకపోతే భారీ ఆందోళనకు దిగుతామని బీఆర్‌ఎస్ నాయకుడు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేని కంటోన్మెంట్ బోర్డు పాలక మండలిలో ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఈ విషయంలో బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కయ్యారనడానికి మార్టిగేజ్ నిబంధనలే సాక్ష్యమని ఆయన అన్నారు. 111 చదరపు మీటర్ల నుంచి మార్టిగేజ్ నిబంధనలు అమలు చేయడం వలన సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు సొంతిల్లు ఎలా కట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఈ నిబంధనను రద్దు చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

**నిమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సరఫరాకు**

## ఐదు సంస్థల మధ్య పోటీ

నిమ్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో రెండేళ్లకు ఒకసారి జరిగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కాంట్రాక్ట్(మ్యాన్‌పవర్) సరఫరా కోసం ఐదు సంస్థల నడుమ పోటీ నెలకొంది. ప్రస్తుతం ఆస్పత్రిలో రెండు సంస్థలు మ్యాన్‌పవర్ సరఫరా ఏజెన్సీలుగా ఉన్నాయి. రెండు నెలల క్రితం పాత కాంట్రాక్ట్ గడువు ముగిసింది. దాంతో నిమ్స్ యాజమాన్యం ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 1200 మందిని నిమ్స్ ఆస్పత్రికి కాంట్రాక్ట్ పద్ధతిన కేటాయించాల్సి ఉంది. వారిలో వర్కర్లు, సెమిస్కిల్డ్ వారు ఉన్నారు. పాత సంస్థలతో పాటు ప్రస్తుతం మరో మూడు సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ ఐదు సంస్థల్లో ఎవరు తక్కువ ధరకు కోట్ చేస్తే వారికి టెండర్ దక్కే అవకాశం ఉంది. అయితే, టెండర్ పరిశీలనలో వారి అనుభవం, అర్హత ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. టెండర్ దాఖలు గడువు ముగిసిన తర్వాత 180 రోజుల్లో దాని ఫలితం విడుదల చేస్తామని నిబంధనలో ఉంది.

## హుస్సేన్ సాగర్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్ సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. లేక్ పోలీస్ ఏఎస్ఐ అప్పల స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి హోంగార్డ్ కృష్ణ యాదవ్‌తో కలిసి కానిస్టేబుల్ లోకేష్ ట్యాంక్‌బండ్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా త్యాగరాజు విగ్రహానికి ఎదురుగా హుస్సేన్‌సాగర్ జలాశయంలో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, గజ ఈతగాడు ట్యాంక్‌బండ్ శివ సహకారంతో ఆ మృత దేహాన్ని వెలికితీశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు, 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని, నారింజ రంగు చెక్స్ ఫుల్ హ్యాండ్ షర్ట్, ఆకుపచ్చ రంగు ప్యాంటు మృతుడి ఒంటిపై ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే లేక్ పోలీస్ స్టేషన్‌లో లేదా ఫోన్ నం.8712665187లో సంప్రదించాలని సూచించారు.